

ధర్మం చేసిన చెయ్యి

గన్నంరాజు సుందరరావు

వైశాఖ మాసం. ఎండ తీక్షణంగా వుంది.

ఉండుండి వడగాడుపు రివ్వు రివ్వున వీస్తోంది. దుమారం చెలరేగి విచ్చల విడిగా ఎగురుతోంది.

ఎండ! గాడుపు! ఎండ!

సమస్త జీవరాసులూ తల్లడిల్లి పోతున్నాయి! అల్లల్లాడి పోతున్నాయి! ఎండలో కాస్తే కాలిపోతున్నాయి.

కాలుస్తున్న ఎండలో కరిగి నిగ నిగలాడుతోంది తారురోడ్డు. ఆ రోడ్డుకు అటువైపు -

విశాలమైన కాంపౌండులో, మెయిన్ గేటుకి సుమారు వంద గజాల దూరంలో ఠీవిగా నిలబడి, మండుటెండలో వెండి కొండలా వెలిగిపోతోంది మూడంతస్తుల భవనం.

ఆ భవనం పేరు 'అన్నపూర్ణ నిలయం'

ఊరికి కాస్త దూరంగా ఏకాంత స్థలంలో, సర్వాంగ సుందరంగా నిర్మించబడింది.

రెండున్నర దశాబ్దాల క్రితం -

ఆ భవనంలో నిజంగా అన్నపూర్ణ నిలయమని ప్రఖ్యాతి గాంచింది. ఆ పేరును సార్థకం చేసుకుంది.

ఆ భవనంలో ఎక్కడ చూసినా శ్రీ మహాలక్ష్మి తాండవించేది! అక్కడ నిరతాన్నదానాలూ, వస్త్రదానాలూ జరిగేవి! అనేక సత్కార్యాలకూ, అనాధ శరణాలయాలకూ, దేవాలయాల నిర్మాణానికీ, భూరి విరాళా లివ్వబడేవి! పేద కన్యల కల్యాణాలు జరిగేవి! బీద విద్యార్థుల చదువు సంధ్యలు సాగేవి! అనుదినంఅర్చనలూ, భజనలూ, వ్రతాలూ జరిగేవి! ప్రతిరోజూ ఒక పండగలా, పర్వదినంలా గడిచేది! ఎల్లవేళలా ఆ భవనం కళకళ లాడుతూండేది!

ఆ అధ్యాయం ముగిసింది. ఆ కాలం గతించింది.

ఆ రోజులు మారాయి. మనుషులూ మారారు.

దేవతలు వసించిన భవనం రాక్షసుల వశమైంది!

ఆ నాటినుంచీ - పట్టెడు మెతుకులు కాని, పిడికెడు గింజలు కాని, పైసా డబ్బులు కాని ధర్మం రూపేణా భవన సింహద్వారం దాటి రావడం లేదు! ముష్టి చిప్పల్లో రాలడంలేదు!

వర్తమానంలో అది పేరుకు మాత్రం అన్నపూర్ణ నిలయం.

మెతుకుపోతే బ్రతుకు పోతుంది. పైసా పోతే ప్రాణం పోతుంది - అను కొనే మానవులున్నా రక్కడ!

అక్కడ ధనలక్ష్మి భూస్థాపితం చేయబడుతూ, నల్లబడి పోతోంది ప్రస్తుతం -

సర్వాంగసుందరంగా అలంకరించ బడి, కళకళ లాడుతోంది ఆ భవనం! మూడో అంతస్తులో అమర్చబడిన మైకు లోంచి శ్రావ్యమైన పాటలు వినిపి స్తున్నాయి. భవన ప్రాంగణంలో ఆకాశ మంత పందిరి వేశారు. భూదేవంత అరుగు కట్టారు. పందిరిని పచ్చటి తోరణాలతో, రంగు రంగుల కాగితం పువ్వులతో, లతలతో అందంగా అలంక రించారు. పందిరంతా ఆహ్వానితులతో నిండి సందడిగా వుంది. పెళ్ళి మంత్రాలూ అవసరం వచ్చినప్పుడు బేండు మేళం సందడిగా వినిపిస్తున్నాయి. ఆ భవనం యజమాని తన రెండోకూతురు పెళ్ళి వైభవోపేతంగా జరిపిస్తున్నాడు.

భవనం లోపలా, బయటా, చాలా కోలాహలంగా వుంది. ఎక్కడ చూసినా ఆనందం వెల్లివిరుస్తోంది!

ఆ భవనానికి ఎదురుగా, తారు రోడ్డుకి ఇటు వైపు -

ఎత్తుగా పెరిగి, శాఖోపశాఖలుగా విస్తరించి వుంది మర్రిచెట్టు. ఆ చెట్టు కింద చుట్టూ విశాలమైన సిమెంటు అరుగు వుంది. అన్నపూర్ణ నిలయం నిర్మించబడిన తర్వాత ఆ భవనాధిపతి బాటసారుల సౌకర్యం కోసం ఆ అరుగును కట్టించారు.

ఆ అరుగుమీద -

వికలాంగులూ, కుష్టురోగులూ, కళ్ళు లేని కబోదులూ, ముసిలివాళ్ళూ, దిక్కు మాలిన పిల్లలూ, దిక్కున్నా తిండికి మొహంవాచిన పిల్లలూ ఎక్కడెక్కడి నుంచో వచ్చి వున్నారు. పెళ్ళింట్లోంచి ఏమైనా వచ్చి తమ కడుపుల్లో పడు తుందనే ఆశతో నిరీక్షిస్తున్నారు.

వాళ్ళ కడుపులు నిప్పుల మీద కాలేసిన కాశీ కుండల్లా సెగలు కక్కు తున్నాయి. వెన్నుకి అంటుకుపోయాయి.

ఆకలి.... ఆకలి!.... కడుపునిండా ఆకలి!.... నీరసం.... ప్రాణ సంకటం! వాళ్ళకి కావలసినవి పట్టెడు మెతుకులు. కనీసం పారేసిన ఆకుల్లో మిగిలిన ఎంగిలి మెతుకులు! ఏవైనా ఫర్వాలేదు. ఏది దొరికినా చాలు. తృప్తిగా అరగిద్దా మనే ఆశతో వేచివున్నారు.

కొందరు నీరసంగా దొర్లుతున్నారు. కొందరు నేలకి అంటుకుపోయారు. కొందరు కూర్చుని కునికిపాట్లు పడు తున్నారు. మరికొందరు ఏవేవో మాట్లాడుకుంటున్నారు. అందరూ ఆకలి మంట భరించలేక ఆక్రోశిస్తున్నారు.

ఆ భవనం - స్వర్గలోకం! అక్కడ ఆనందం!

ఈ అరుగు - నరకలోకం! ఇక్కడ ఆక్రోశం!

సర్వాంతర్యామిసృష్టిలోనివ్యత్యాసం, పక్షపాత బుద్ధీ, నిమ్నోన్నతాలూ, ఆ తారురోడ్డుకి ఇరుప్రక్కలా ప్రత్యక్షంగా గోచరమవుతున్నాయి!

మధ్యాహ్నం ఒంటిగంట దాటింది. ఎండ మండిపోతోంది! నిప్పుల వర్షం కురిపిస్తోంది!

భవనంలో భోజనాల కార్యక్రమం ముగిసింది. అందమైన కార్లు చిన్నవి, పెద్దవి మెయిన్ గేటులోంచి వొయ్యా రంగా బయటకు వచ్చి, తారురోడ్డు మీదుగా తమ తమ గమ్యాలకేసి దూసుకుపోతున్నాయి.

భవనప్రాంగణం, తారురోడ్డు చాలా కోలాహలంగా వున్నాయి.

"ఎంగిలాకులు ఇంటెనకాల ఇసి రేత్తున్నార్రా....బేగి పాఁరెండి"పరుగు పరుగున అరుగు దగ్గరకొచ్చి అరిచి, మళ్ళీ భవనం వెనకవైపుకు దూసుకు పోయాడు ముష్టికుర్రాడు.

ముష్టి జనంలో చైతన్యం వచ్చింది. ఆరాటం వచ్చింది. హడావుడిగా లేచారు. చిప్పలూ, జోలెలూ, వూతకర్రలూ, చేతి



శ్రలూ పట్టుకుని, జోగిపోతూ తూలిపోతూ గమ్యంకేసి సాగిపోతున్నారు.

అందరూ వెళ్ళిపోతున్నారు. క్రమ క్రమంగా అరుగు ఖాళీ అయిపోయింది. అన్నపూర్ణమ్మ హృదయం గిల గిల లాడిపోతోంది!

"....ప్చ్.... ఆ మహారాజు అస్తమించక ముందే నన్ను భగవంతుడు తీసుకుపోయుండాల్సింది .... అలా అయితే ఎంత బాగుండేది!.... కాని ఆ అదృష్టం అందరికీ వుంటుందా? అలాంటి చావుకి పూర్వజన్మ సుకృతం ఉండాలేమో!.... వారు పుణ్యాత్ములు. అందుకే ఈ పాడులోకం నుంచి అంత తొందరగా నిష్క్రమించారు.... నేను పాపిని గనుక.... ఇ లాం టి వన్నీ చూడ్డానికి మిగిలిపోయాను. ఇంకా ఎన్నాళ్ళో ఈ కఠినశిక్ష.... ఇదంతా చేసుకున్న కర్మ.... అనుభవించక తప్పదు...." ఆవేదనగా అనుకుంది అన్నపూర్ణమ్మ.

ఆమె ముఖంలో దైన్యం.... అంతరంగంలో అంతులేని వ్యధ.... కళ్ళలో నీరు! క్రమ క్రమంగా దూరమవుతున్న ముష్టివాళ్ళ వంక జాలిగా చూస్తోంది. కన్నీటి పొరల్లో ముందు కాస్తస్పష్టంగా, తర్వాత మసక మసగ్గా కనిపిస్తూ, చివరకు కనుమరుగైపోయారు వాళ్ళు.

అరుగుమీద మర్రిచెట్టుకి ఆనుకొని కూర్చుని వుంది అన్నపూర్ణమ్మ. ఆమెకి అరవై అయిదేళ్ళు నిండి, మూడు నెలలు గడిచాయి. జుట్టు ముగ్గుబుట్టలా నెరిసింది. చర్మం ముడతలు పడి వ్రేలాడుతోంది. కంటిచూపు మందగించింది. జీవితంలో వూహించని దెబ్బ తిని విరక్తిగా బ్రతుకుతూ, భగవంతుడి పిలుపు కోసం ఆదుర్దాగా ఎదురు చూస్తోంది!

"....ప్చ్ .... నాలుగు ఎంగిలి మెతుకుల కోసం - అకులు నాకి ఆకలి తీర్చుకోవడం కోసం ఎంత ఆదుర్దాగా పరుగెడుతున్నారు!.... అకులు నాకితే కడుపు నిండుతుందా? ....ఆకలి మంట చల్లారుతుందా?....అయినా ఎంగిలాకుల్లో ఏం మిగులుతుంది?.... ఏదో దొరుకుతుంది, ఆకలి తీరుతుంది అనుకోడం భ్రమ.... అంతా ఒట్టి భ్రమ....

అక్కడ వాళ్ళూ, కుక్కలూ, కాకులూ, అకులకోసం పోటీ పడుతుంటా రీపాటికి .... పాపం వాళ్ళని ఆదరించి అన్నం పెట్టేవారెవరు? అంతమందికి, అన్ని జీవాలకి - అన్నంపెట్టే దాతలేవీ? అన్నపూర్ణ నిలయంలో ఎవరున్నారు? నా దేవుడే బ్రతికుంటే - నా కొడుకే వుంటే....నేను అన్నపూర్ణ నిలయంలో ఉంటే....నాకు కొడుకు పెళ్ళి ఎంత ఘనంగా జరిగివుండేది!...ఈ నిర్భాగ్యులు ఎంగిలాకులు నాకవలసివచ్చేదా? ప్చ్ ... నాచేతులు ఎంతో పాపం చేసుకున్నాయి. ఆర్తులకి అన్నం పెట్టే అవకాశం దూరమైంది. హఠాత్తుగా అదృష్టం చేజారిపోయింది. జీవితంలో జారిపోయిన అవకాశాలు మళ్ళీమళ్ళీ వస్తాయా? కాలచక్రం వెనక్కి తిరుగుతుందా? ఈ చేతులు విరిగిపోయాయి. వీటిలో మిగిలింది శూన్యం....ఒట్టి శూన్యం"....

అరిచేతులవంక చూసుకుంది.

అరవిచ్చిన అరవిందల్లా వుండేవి! ముంజేతులు గలగలలాడే గాజులతో, రవ్వలు పొదిగిన కంకణాలతో కళకళలాడేవి! మేను మేలిమి బంగారంలా మెరిసిపోయేది! ఏడువారాల నగలు ధరించేది! పట్టుపీతాంబరాలు కట్టుకొనేది! వదనంలో లక్ష్మీకళ వుట్టిపడేది! అదొక వైభవం! మహారాణీయోగం! ఆ వైభవం నశించింది... ఆ యోగం మారింది.. ఔన్నత్యం నేలపాలయింది. శిఖరాగ్రం విరిగి అగాధంలో పడిపోయింది.

అప్పటినుంచీ-అంధకారం అంతులేని పరితాపం....అర్థంలేని జీవితం. బొట్టు బొట్టుగా కన్నీరు కుష్కించి, కళావిహీనంగా వున్న అరిచేతుల్లో పడింది. దుఃఖంతో కుమిలిపోయింది అన్నపూర్ణమ్మ.

"ఇంక బాధపడనవసరంలేదు. అయిపోయింది. తన కథ ముగింపుకి వచ్చేస్తోంది. చివరి అధ్యాయం గడుస్తోంది. మొదటిఅధ్యాయం ఒక కల...రెండవది...

మధుర స్వప్నం .... చివరి అధ్యాయం ఒక పీడకల... అంతే - అలాగే గడిచింది.... ఇలాగే ముగుస్తుంది....ఇంక ఎంతోకాలం పట్టదు. శరీరం శాశ్వత విశ్రాంతి కోసం ఆరాటపడుతోంది. మట్టిలో లీనమవడానికి ఉరకలు వేస్తోంది. ఏదో ఒకరోజు, ఏ సమయంలోనో, ఏ అవస్థలోనూ....ఏ క్షణంలోనో జీవి దేహంనుంచి విముక్తి పొంది, అనంత విశ్వంలోకి ఎగిరిపోతుంది. తదనంతరం ఈ దుఃఖం, బాధలూ వుండవు. ఈలోకం వుండదు. శరీరం మిగలదు." గాఢంగా నిట్టూర్చి, అరిచేతులు తుడుచుకొని ముందుకు చూసింది. భవనం గేటూ, ప్రహరీగోడా, మసక మసగ్గా కనిపిస్తున్నాయి. ఆ వెనుక దృశ్యం చెదిరిపోతోంది

గేటుకి దగ్గరగా పందిట్లో ఎవరో బిగ్గరగా మాట్లాడుకుంటున్నారు. మధ్య మధ్య నవ్వుకుంటున్నారు. నవ్వులూ, మాటలూ వినిపిస్తున్నాయి కాని మనుషులు స్పష్టంగా కనిపించటంలేదు. భవనంలో మైకు విశ్రాంతి తీసుకుంటోంది

ఊరకుక్కలు రెండు తారురోడ్డుమీద పరిగెడుతూ వచ్చి, రోడ్డు మధ్య ఆగి, ఎటు పోవాలో తెలియనట్టు అటూ ఇటూ చూశాయి తర్వాత మర్రిచెట్టు నీడలో కొచ్చి పడుకుని, నాలుకలు బయటకు జాపి జాపోయసాగాయి.

మర్రిచెట్టుమీద కాకి ఎందుకో ఇదే పనిగా అరుస్తోంది.

వడగాలి రివ్వున వీచింది. గలగలమని గోలపెడుతూ ఆకులు రాల్చింది మర్రిచెట్టు. దుమారం రేగి సుడులు తిరుగుతూ ఎగిరి అరుగుమీద విరుచుకు పడింది. ఉక్కిరిబిక్కిరవుతూ కళ్ళు గట్టిగా మూసుకుంది అన్నపూర్ణమ్మ. మగత కమ్మినట్టు కొద్దిసేపు అలా వుండిపోయింది.

ఆమెకి నీరసంగా వుంది ఆకలిగా వుంది. ఏమైనా తినాలని తహతహగా వుంది

"ఏముంది తినడానికి ? ఎవరైనా దయతల్చి పెడితే తినాలి. లేకపోతే అంతే. పెళ్ళింట్లో పనసకాయ కూర, గుమ్మడికాయ కూర చేస్తారు. పులిహోర బూరెలూ, లాడూలూ, ఇంకా ఎన్నెన్నో చేస్తారు. పనసకాయకూర, పులిహోర, తినాలని వుంది. కాని ఎవరు పెడతారు నాకు ?" గుటకలు మింగుతూ, కళ్ళు తెరిచి భవనం మెయిన్‌గేటువైపు ఆశగా చూసింది

అక్కడ ఎవరూ లేరు. మాటలూ, నవ్వులూ వినిపించడంలేదు.

దీర్ఘంగా నిట్టూర్చి, కళ్ళు గట్టిగా మూసి తెరిచింది అన్నపూర్ణమ్మ. నీరసంగా లేచి నిలబడి చుట్టూ చూసింది. చూపు అనినంతమేరకు ఎక్కడా జనసంచారం లేదు! పక్షులు కూడా నీడపట్టు వదిలి బయటకు రావడంలేదు! ఎండ తీవ్రత తగ్గలేదు. అగ్నిగుండంలో

వున్నట్టుంది! అంతకంతకు ఆకలి విజృంభిస్తోంది. నీరసించిన శరీరం సన్నగా కంపిస్తోంది. కళ్ళు చీకట్లు కమ్ముతున్నట్టయింది. నిలబడలేక చతికిలబడి, చెట్టుకి జారగిలబడిపోయింది.

నీరసం...ఆకలి... దాహం ... నాలుక పిడచకట్టుకుపోతోంది.

మాసిన గుడ్డ సంచీలోంచి నీళ్ళసీసా తీసింది. కాసిని నీళ్ళు మొహానికి రాసుకుంది నీళ్లు వెచ్చగా వున్నాయి. మరి కొన్ని నీళ్ళు మొహంమీద జల్లుకొని మిగిలినవన్నీ తాగేసింది. కొంగుతో మొహం తుడుచుకుంది.

నీళ్ళు పడ్డాక ఆకలిమంట కాస్త చల్లారినట్టయింది. కాళ్ళు చాపుకొని, చేతులు ఒళ్ళోపెట్టుకుంది. తల పక్కకు వాల్చి కళ్ళు మూసుకుంది.

అనుకోకుండా గతం గుర్తుకొస్తోంది ఏవేవో దృశ్యాలు మనసులో కదిలి కలవర పెడుతున్నాయి. తీవ్ర పరితాపానికి గురిచేస్తున్నాయి.

గతాన్ని గుర్తుకు తెచ్చుకోవాలనిపించదు. అందుగురించి ఆలోచించాలని వుండదు. అయినా ఆ స్మృతులు విడనాడడంలేదు. అనుక్షణం అన్నీ కాకపోయినా కొన్నయినా జ్ఞాపకాలు వెన్నాడక మానడంలేదు దృశ్యాలు మనసులోంచి జారిపోవడంలేదు.

'... అదీవేసవికాలమే .. ఆరోజు.... ఆదివారమా? సోమవారమా?....అనాధ శరణాలయంలో చిన్నపిల్లలకి అన్నం పెడుతున్నారు. తనూ, లక్ష్మి, సీతా, పిల్లలు మారాం చేస్తూంటే బుజ్జగించి, బ్రతిమాలి తినిపిస్తున్నారు.

పిల్లల్లో నాగరాజంటే తనకెంతో అభిమానం. తెల్లగా, బొద్దుగా అమాయకంగా, ముద్దొస్తూ వుండేవాడు. పుట్టిన నాటినుంచీ వాడికి తల్లీ, తండ్రీ తనే అయి సాకింది. వాడి తండ్రి ఎవర్నో ఖూనీచేసి యావజ్జీవ కారాగార శిక్షకు గురిఅయాడు. తల్లికి మారుగతిలేక శరణాలయంలో చేరి వాణ్ణి కన్నది. ఆ తల్లి వాణ్ణి సరిగా చూసేదికాదు! ఎప్పుడూ విరక్తిగా కనిపించేది! తనే వాడికి నీళ్ళు పోసి, పాలుపోసి పెంచింది. వాడికి అయిదో నెల వచ్చాక ఆతల్లి ఎందుకో ఆత్మహత్య చేసుకుంది! శరణాలయం అధికారిణి అనసూయమ్మగారు నాగరాజుని తనకే అప్పగించింది. ఆనాటి నుంచీ ఎంతో అపురూపంగా వాణ్ని సాకింది తను. వాడిమీద ఈగ వాలితే చాలు తన ప్రాణం గిలగిల లాడిపోయేది! అలా మూడేళ్ళు గడిచాయి. తనకి పద్దెనిమిదేళ్ళు నిండాయి. యధాప్రకారం ఆ రోజు కూడా నాగరాజుకి అన్నం తినిపిస్తోంది తను.

అంతలో—అనసూయమ్మగారి వెంట అక్కడికి వచ్చారు అతను. అతను మహారాజు బిడ్డలా వున్నారు. ఆజానుబాహువు. ఆ హుందాతనం, స్ఫుర

బద్ధకస్తులు:



ద్రూపం, అందమైన విగ్రహం ఎవరికీ ఉండవేమో అనిపించింది. తనూ, లక్ష్మి, సీతా, వినయంగానే లేచి తలలు వంచి నిల్చున్నారు. అనసూయమ్మ గారు శరణాలయం విషయాలేమిటో చెబుతున్నారాయనతో. కొద్ది క్షణాల తర్వాత వారిద్దరూ అక్కణ్ణుంచి వెళ్ళిపోయారు. అతను వెళుతూ తనవంక ఒకసారి చూశారు అలా చూసి అతను వెళ్ళిపోతూంటే, తన మనసెందుకో విలవిలలాడింది. అతన్ని మళ్ళీ మళ్ళీ చూడాలనిపించింది. వారు తనని...ఆశలేవో అంకురించాయి. కాని స్థితిమంతుల్లా వున్నారు. వారు గగనసీమలో విహరించే అందాల చందమామ...తానొక గడ్డిపువ్వు ...ఎంతో వ్యత్యాసం వుంది. ఆశలు అణుచుకొని, ఆలోచనలు తెంచుకొని తన పనిలో నిమగ్నమైంది.

సుమారు నెలరోజుల తర్వాత, వారు తమ తల్లితో కలిసి మళ్ళీ వచ్చారు. ఆమె ఎంతో అప్యాయంగా మాట్లాడింది: తన ఆశలూ, ఆశయాలూ, చదువూ ఏమిటేమిటో తెలుసుకుంది. ఆ తరువాత 'మా చక్రవర్తికి నువ్వు బాగా నచ్చావుట. ఇన్నాళ్ళకి వాడికి పెళ్ళిచేసుకోవాలని బుద్ధి పుట్టింది. నిన్ను చేసుకోవాలని ఆరాటపడుతున్నాడు. నీకు అంగీకారమైతే...' అన్నారామె అప్యాయంగా తన వీపు నిమురుతూ.

తనలో – ఆశ్చర్యం, ఆనందం,

దుఃఖం ఒక్కసారిగా పెల్లుబికాయి. కలగాపులగమై కళ్ళలో నీటిని నింపాయి. మాట్లాడానికి అవకాశం ఇవ్వకుండా గొంతును నొక్కేశాయి. కొద్ది క్షణాలకు తేరుకొని తన అంగీకారాన్ని తెలియ జేసింది. ఆమె వదనం పూర్ణ చంద్ర బింబంలా వెలిగింది! తమ పెళ్ళి వైభవంగా జరిగింది! తను చక్రవర్తిగారి అర్ధాంగి అయింది!

వారు కోటీశ్వరులు. తరతరాల వరకూ తరగని ఐశ్వర్యం వారిది! దయార్ద్రహృదయులు, ధర్మ దాతః తనని ఎంతో అపురూపంగా చూసుకొనే వారు. అత్తగారు తనని కన్నబిడ్డలా ఆదరించేవారు. ఆమెకు అందరూ బిడ్డలే! అభిమానులే! ఆమెది విశాల హృదయం! అది ఆమెకు దేవుడిచ్చిన వరం! పెళ్ళయిన నెలరోజులనుంచీ, తన మనసు నాగరాజుకోసం కొట్టుమిట్టాడ సాగింది. ఎంతో దిగులుగా వుండేది. వాడిని చూడాలనీ, అన్నం తినిపించాలనీ తహతహగా వుండేది. తను అన్యమనస్కంగా, దిగులుగా వుండడం గమనించి వారు ఎన్నోసార్లు కారణం అడిగారు. చెబితే ఏమనుకుంటారో అని భయపడి చెప్పలేకపోయింది. ఎలా పసిగట్టారో శరణాలయానికి వెళ్ళి వాకబు చేశారో.... తెలీదు కాని, ఓ రోజు మధ్యాహ్నం పరుగు పరుగున వచ్చి తన వడిలో వాలి, మెడని చేతులతో చుట్టేశాడు నాగరాజు!

తన కళ్ళు వర్షించాయి. ఆనందం హద్దులు మీరింది. తన ప్రేమమూర్తి ఔదార్యానికి మురిసిపోయింది. ఆయన నిజంగా దేవుడే అనే నిశ్చయానికొచ్చేసింది.

ఆనాటినుంచీ నాగరాజు ఆ ఇంటికి యువరాజయాడు. తమకు తనయుడూ, అత్తగారికి మనవడూ అయాడు. అల్లారు ముద్దుగా పెంచసాగారు. వాడు క్షణం కనిపించకపోతే తమ హృదయాలు తల్లడిల్లిపోయేవి!

పెళ్ళయి మూడేళ్ళు గడిచినా తన కడుపు పండలేదనీ, మనవడిని ఎత్తుకొనే అదృష్టం లేకపోయిందనీ అత్తగారు విచారించేవారు. తనచేత ఎన్నెన్నో నోములు నోయించారు. పూజలూ, వ్రతాలూ చేయించారు. నిరంతరం నిరుపేదలకు అన్నదానం చేయించారు. కాని ఫలితం శూన్యం. తుది క్షణంవరకూ దిగులుపడుతూనే ఆమె దివంగతులయారు.

తల్లిపోయిన ఇంట్లో మసలలేక వారు అన్నపూర్ణ నిలయం కట్టించారు. అందులో ప్రవేశించిన నెల రోజులకు నాగరాజు పదవ జన్మదినోత్సవం అట్టహాసంగా జరిగింది! తమ ఆస్తికి వారసుడు లేడనీ, వంశోద్ధారకుడు లేడనీ, వారు అప్పుడప్పుడు విచారిస్తూండేవారు. 'ఈ సంపదంతా ఎందుకు? ఎవరికోసం దాచాలి?' అంటూ దానధర్మాలు విరివిగా చేయ

సాగారు. పేదపిల్లల పెళ్ళిళ్ళు చేయించారు. ఎందరికో ఆర్థిక సహాయం చేస్తూ చదువులు చెప్పించారు. తన చేత నిరంతరం అన్నదానాలూ, వస్త్రదానాలూ చేయించారు. చేతులకు ధర్మంచెయ్యడం అలవాటుగా మారిపోయింది। కనీసం పదిమందికైనా అన్నదానం చెయ్యకుండా భోజనం చెయ్యడానికి మనసొప్పేది కాదు। నాగరాజు ఇరవై ఏళ్ళవాడయ్యాడు. భగవదనుగ్రహంవల్ల తన కడుపు పండి దివాకర్ పుట్టాడు।

వారి ఆనందానికి అంతులేకుండా పోయింది। ఆకాశాన్ని అందుకున్నారు। అర్చనలూ, వ్రతాలూ, పూజలూ అట్టహాసంగా జరిగాయి। ధన ధాన్య వస్త్ర దానాలు జరిగాయి। బీదలకి అన్నదానాలూ, సంతర్పణలూ ఎడతెరిపి లేకుండా జరిగాయి। నెలరోజులు ఉత్సవంలా గడిచాయి। ఆ రోజుల్లో ఎందుకో నాగరాజు విసుక్కునేవాడు। దానధర్మాలు చెయ్యొద్దనేవాడు। తమకి తరగని ఐశ్వర్యం వుందనీ, కలిగినదాంట్లో కాస్త దానంచెయ్యడంవల్ల నష్టంలేదనీ, అలా అనడం తప్పనీ, తను బుద్ధి చెప్పేది. వాడు రుసరుసలాడేవాడు.

ఉండుండి ఒకనాడు 'ఇలా దానాలూ, ధర్మాలూ, పూజా పునస్కారాలూ చేస్తూ కూచుంటే ఇల్లు గుల్లయిపోతుంది. చివరికి నాన్నగారి చేతికి చిప్ప వస్తుంది. తర్వాత మనకీ అదే మిగులుతుంది,' అన్నాడు కోపంతో చిందులుతొక్కుతూ నాగరాజు। తనలో కోపం తారస్థాయిని అందుకుంది. అంతటి మహనీయుణ్ణి, మహలక్ష్మి పుత్రుణ్ణి అంత మాట అంటాడా !? కోపం పట్టలేక చెయ్యి నొప్పెట్టేవరకూ వాడి చెంపలు వాయించేసింది. 'దిక్కుమాలిన వెధవని తెచ్చి, అల్లారుముద్దుగా పెంచి, ప్రయోజకుణ్ణి చేస్తున్నందుకు కారుకూతలు కూస్తావా ? కృతఘ్నుడా....ఛీ ఛీ....ఇక నీ మొహం నాకు చూపించకు .... పో .... వెళ్ళు' అంటూ బిగ్గరగా అరిచింది తను. వాడు కుమిలి కుమిలి ఏడ్చాడు. కొంతసేపటికి తేరుకొని 'మీరు నా తల్లితండ్రులు కారా ?' అన్నాడు దీనంగా. కాదని తను తల అడ్డంగా వూపేసింది. తర్వాత దుఃఖంతో కుమిలిపోయింది.

అప్పటినుంచీ నాగరాజులో మార్పు వచ్చింది। ముభావంగా, నిర్లిప్తంగా వుండేవాడు। తను జాలిపడి 'కోపంలో అలా అన్నాను....నువ్వు నిజంగా మా బిడ్డవే - నా పెద్దకొడుకువి' అంటూ బుజ్జగించేది. కాని వాడి ధోరణిలో మార్పులేదు।

దివాకర్‌కి మూడేళ్ళు నిండాక తాము తీర్థయాత్రలకి వెళ్ళారు. ఒక పుణ్యస్థలంలో దైవదర్శనం వగైరాలు ముగించుకొని, ఆ రాత్రి వసతిగృహంలో ఆదమరిచి నిద్రపోయారు. ఉదయం లేచేసరికి దివాకర్ లేడు।

వారూ, నాగరాజూ, నౌకరూ, హడా వుడిగా పరుగులు తీశారు. వూరంతా గాలించారు. పోలీసులకి తెలియజేశారు. ఎన్నాళ్ళు ఎన్ని విధాల ప్రయత్నించినా దివాకర్ జాడ తెలియలేదు! తాము గుండెలు బ్రద్దలయేలా రోదించారు. తమ లోకంలో దివాకరుడు శాశ్వతంగా అస్తమించాడు. గాఢాంధకారం అలుము కుంది. విఘాతంనుండి వారు తట్టుకోలేక పోయారు. గుండె జబ్బూ, మనోవ్యాధీ కృంగదీసేశాయి. వ్యవహారాలన్నీ నాగ రాజుకి అప్పగించేశారు. దివాకర్‌కోసం కుమిలిపోవడం తప్ప వారికి వేరొక ధ్యాపే లేకుండా పోయింది! అనుక్షణం దుఃఖించడం తప్ప తనకి మరొక పనే లేకుండాపోయింది ....' కళ్ళు తెరిచి గాఢంగానిట్టూర్చింది అన్నపూర్ణమ్మ కొద్ది క్షణాలు దుఃఖంతో కుమిలిపోయింది. కళ్ళొత్తుకుంటూ తలవంచుకొని మళ్ళీ గట్టిగా కళ్ళు మూసుకుంది.

'ఆ రోజు....జీవితంలో మరపురాని దుర్దినం....

వారి పరిస్థితి విషమించింది. విపరీ తంగా బాధపడుతున్నారు డాక్టర్లు దేవుడి మీద భారం వేసేశారు. ఇక లాభం లేదని వారు వకీలుని పిలిపించి విల్లు రాయించేశారు. ఆ కాగితాలు నాగరాజు కిచ్చి సరిగా వుందో లేదో చూడ మన్నారు. వాడు చదివి 'అంతా సవ్యం గానే వుంది. చదివి వినిపించమంటారా?' అన్నాడు వినయంగా. వారు వద్దని వారించి సంతకాలు చేసేశారు. పేదవాళ్ళనీ, ముష్టివాళ్ళనీ పిలిపించారు. 'అన్నపూర్ణా! డబ్బు తీసుకురా' అని ఆజ్ఞాపించారు. వచ్చిన బీదసాదలకు ధర్మం చేస్తూ సూర్యాస్తమయ సమయంలో ఆ చెయ్యి స్థంభించిపోయింది. సూర్య భగవానుడితోబాటు ఆ మహానుభావుడు అస్తమించారు. సూర్యుడు మళ్ళీ ఉద యించి లోకాన్ని వెలుగుతో నింపుతాడు కాని, తన దైవం శాశ్వతంగా తనని అంధకార జగత్తులో వదిలేసి నిష్క్ర మించారు. తను జీవచ్ఛవంగా మిగిలి పోయింది.

ఆరునెలలు అయోమయంగా దొర్లి పోయాయి.

నాగరాజు జాగ్రత్తగా మెసులు కుంటూ వ్యవహారాలు చూడసాగాడు. వాడి అండ చూసుకొని తను ధైర్యాన్ని కూడదీసుకోసాగింది. కాని దుఃఖం తనని విడనాడలేదు

తీర్థయాత్రలు చేస్తే మనశ్శాంతి చిక్కుతుందనీ, కాశీ, గయ, బదరీనాథ్ యాత్రలు చేసి వద్దామనీ పట్టుబట్టి తీసు కెళ్ళాడు నాగరాజు. ప్రయాణానికిముందు తన ఒంటిమీద నగలన్నీ తీయించేసి భద్రపరిచాడు. కలకత్తా చేరుకొనేవరకూ ఆదరంగా చూసి, తర్వాత కనుమరు గయ్యాడు!!

తనకి దిక్కుతోచలేదు. కలకత్తా

నగరం మరో లోకంలా వుంది! అక్కడెవర్నీ తెలియదు. ఆ భాష అర్థం కాలేదు. 'నాగరాజు ఎక్కడికి పోయాడు? ఏమయ్యాడు? ఎవరైనా చంపేశారా?' మధనపడుతూ అష్టకష్టాలు పడి తను తిరిగి వచ్చేసరికి .... స్థితిగతులు మారి పోయాయి! విల్లు రాయించినప్పుడు కుట్ర జరిగిందని విశదమైంది. తను అగాధంలోకి, అధఃపాతాళంలోకి నిర్దాక్షిణ్యంగా త్రోసివేయబడిందని తెలుసుకున్న క్షణంలో....

నిలువునా కంపించిపోయింది.

'తనయుడ' నుకున్నవాడు 'తక్షకుడయాడు! కక్ష పెట్టుకొని కఠిన శిక్ష విధించాడు. పాము కాటువేశాక పాలు పొయ్యడం పొరబాటయిందని రోదిస్తే ఏం లాభం ?? ...కాలసర్పం కాటువేశాక సంభవించేది ఏమిటి??? ...అంతం .... సర్వనాశనం....తను మరెవర్నీ నమ్మలేక పోయింది....అంతే .... వెళ్ళిపోయింది. తెగిన గాలిపటానికి గమ్యం వుంటుందా? ఎక్కడుంటుంది? ఎక్కడ! ఎక్కడ? ఎక్కడ? ఎక్కడెక్కడో తిరిగింది.... దిక్కుమాలిన బ్రతుకు బ్రతుకింది....నీతి నియమాలు తప్పలేదు. ఎవరైనా ఆదరించి అన్నం పెడితే తిన్నది. లేకపోతే ఉపవాసమే గతి. దొరికినది తినేముందు కాస్త మూగజీవాలకో, ముష్టి జనాలకో

పెట్టుకుని తింది. ధర్మం చెయ్యడానికి అలవాటుపడిన తన చెయ్యి .... దానికి చిక్కిన ముద్దలో కాస్త మరో జీవికి పెట్టకుండా, తన నోటివరకూ ఎన్నడూ తీసుకురాలేదు....రాబోదు. అలా తిన డానికి తన నోరూ ఒప్పలేదు. ఈ చర మాంకంలో తన దేవుడు - ఆ ధర్మ ప్రభువు కట్టించిన ఈ అరుగుమీద కలిగినదాంట్లో కాస్త ఎవరికైనా ధర్మం చేస్తూ, శాశ్వతనిద్రలోకి జారిపోవాలి.అదే తన ధ్యేయం. ఆశయం....ఆశ...యం' ఆలోచనలు కరిగిపోయాయి. దృశ్యాలు చెదిరి అలుక్కుపోయి, అగుపించడం మానేశాయి. అన్నపూర్ణమ్మ నిద్రలోకి జారుకుంది.

* * *

సుధాకర్ మనసు దెబ్బతిన్న పక్షిలా గిలగిల కొట్టుకుంటోంది. గత రెండేళ్ళుగా అంతంత మాత్రంగా వున్న దిగులు ఆ వృదయంనుంచి రెట్టింపు అయింది. ఏకాంత స్థలంలోకి పోయి బిగ్గరగా ఏడవాలనిపిస్తోంది. పెళ్ళివారి ఆనందంలో పాలుపంచుకోలేక పోయాడు మధ్యాహ్నం భోజనం సరిగా చెయ్యలేకపోయాడు.

ఒక్క దగ్గర కూర్చోవాలని లేదు. నిద్రకూడా పట్టడంలేదు. ఆలోచనలు తల పగిలిపోతోంది. ఆవేదన మనసు .... కుళ్ళిపోతోంది.

అతను రెండురోజులక్రితం ఆ భవనంలో అడుగు పెట్టాడు. పెళ్ళి కొడుక్కి ప్రాణమిత్రుడు. మగ పెళ్ళి వారి బంధు మిత్రుల్లో కొందరికి భవనం మూడో అంతస్తులో వసతి ఏర్పాటు చేయబడింది. వారిలో సుధాకర్ ఒకడు.

తన గదిలో కిటికీ దగ్గర నిల్చుని భవనానికి ఎదురుగా వున్న మర్రిచెట్టు కేసి తదేకంగా చూస్తున్నాడు సుధాకర్.

'తన కేవిధమైన లోటు లేదు... ఆస్తి లక్షల విలువ చేస్తుంది. అంద మైన, గుణవంతురాలైన భార్యా, ఆణి ముత్యాల్లాంటి ఇద్దరు పిల్లలూ వున్నారు. ఇంద్రభవనంలాంటి ఇల్లుంది .... తన ఫ్యాక్టరీలో అనేకమందికి ఉపాధి కల్పించాడు. అడిగినవారికి లేదనకుండా అంతో, ఇంతో ఆర్థిక సహాయం చేస్తు న్నాడు. దానధర్మాలు చేస్తున్నాడు... దైవభక్తి, పాపభీతీ వున్నాయి. అంతు లేని తృప్తి వుంది.... అన్నీ వున్నాయి. కాని ఒక్కటే లోపం... ఒక్క విష యంలో తప్ప తను మరి దేనికి బాధ పడనవసరం లేదు....

తన అసలు తల్లితండ్రు లెవరు?.... ఎక్కడ వున్నారు?.... ఎన్నాళ్ళు - ఇంకా ఎన్నేళ్ళు? ఎంత కాలం తను ఇలా అన్వేషించాలి?... పరితపించాలి! నిరీక్షించాలి? వారి దర్శనం దొరికే వరకూ తనకి మనశ్శాంతి లేదు...

అయిదేళ్ళక్రితం- ఆస్తి పాస్తులన్నీ

అప్పగించేసి... తనని పెంచిన తండ్రి పోయాడు. రెండేళ్ళ క్రితం తల్లి పోయింది. చివరి క్షణంలో ఆమె 'బాబూ నేను కూడా వెళ్ళిపోతున్నాను. నిన్నూ, నీ భార్యా బిడ్డలనీ కలకాలం ఆ దేవుడు చల్లగా చూడాలి. చూడు బాబూ... నిన్ను సక్రమంగా తీర్చి దిద్దడం కోసం కొన్నిసార్లు మేము నీ మనసు నొప్పించాము. అందుకు నువ్వు అన్యధా భావించకు. పిల్లలు అసలే కలగని మావంటి పాపాత్ములకు ఆ భగవంతుడు నిన్ను ప్రసాదించాడు. మేము నీ కన్న తల్లిదండ్రులం కాక పోయినా అంతకన్న అపురూపంగా పెంచామనే భావిస్తున్నాను. ఆశ్చర్య పడకు. ఆ రోజు అర్ధరాత్రి కంపార్ట్ మెంట్‌లో నువ్వు ఏడుస్తూ ..." అంటూ కన్ను మూసేసింది తన గుండెలు బ్రద్దలయ్యాయి. మనసు చిందరవంద రయింది. అప్పటినుంచీ దిగులు. అంతు లేని అన్వేషణ.

అయితే ఈ రోజు ఎందుకిలా వుందీ? తలవని తలంపుగా ఎందుకిలా దుఃఖం వచ్చేస్తోందీ?... ఏమిటి కారణం?....' భారంగా కదిలి భవనం లోంచి బయటపడి తారురోడ్డు మీదకి వచ్చి అటూ ఇటూ చూశాడు. తర్వాత మర్రిచెట్టు వేపు నడిచి అరుగుమీద ఓ వారకి కూర్చున్నాడు. టైము చూశాడు మూడు కావస్తోంది!

సిగరెట్ వెలిగించి నిదానంగా కాలుస్తూ, దీర్ఘాలోచనలో పడిపోయాడు సుధాకర్. నిమిషాలు దొర్లిపోతున్నాయి.

* * *

మర్రిచెట్టు మీద కాకులు ఎందుకో ఒక్కసారిగా గొల్లుమన్నాయి.

లారీ ఒకటి తారురోడ్డుమీద రొద చేసుకుంటూ శీఘ్రగమనంతో సాగి పోయింది.

అన్నపూర్ణమ్మకి నిద్రాభంగమైంది. కళ్ళు తెరిచి ఎడం చేతి వేపు చూసింది.

కుక్క తల విసురుతూ ఈగలు తోలుకుంటోంది.

కుడివేపు చూసింది అన్నపూర్ణమ్మ. 'ఎవరో ఇక్కడ కూర్చున్నారు.... పెళ్ళివారి తాలూకు కాబోలు' అనుకుంది. ఆకలి విపరీతంగా వుంది. ఏదైనా తినాలనే ఆదుర్దా పెచ్చుమీరుతోంది. నిగ్రహించుకోలేక పోయింది.

"బాబూ... ఇదుగో అబ్బాయ్" అంది నీరసంగా.

ఉలిక్కిపడి సుధాకర్ ఆమె వైపు చూశాడు. కన్నార్పకుండా కొద్ది క్షణాలు అలా చూస్తూ వుండిపోయాడు. ఏదో అనుబంధం, ఆత్మీయత పెనవేసుకో సాగింది. 'తనని పెంచిన తల్లి ఇలాగే పిలిచేది! అచ్చం ఇలాగే ప్రేమగా— ఆదరంగా—చల్లగా తన తల్లివుంటే ఇలాగే వుండాలి. కాని ఇలా వుండ

కూడదు. ఈ స్థితిలో ఆమెను తను చూడలేదు. ఆమెకు ఇటువంటి దుర్గతి పట్టకూడదు. తల్లీ, తండ్రీ కాని లేక ఇద్దరిలో ఏ ఒక్కరు కనిపించినా తనకి కొంత మనశ్శాంతి చిక్కుతుంది . . .”

“బాబూ! ఆకలి విపరీతంగా వుంది. నిన్నరాత్రి కూడా ఏం తినలేదు. కాస్త పుణ్యం కట్టుకో తండ్రీ. కళ్ళు తిరిగి పోతున్నాయి. ముసలి ప్రాణం కొట్టుకు పోతోంది. మాయదారి జ్వరం నాలుగు రోజులు పీడించి, మూడు రోజులక్రితం వదిలింది. జిహ్వ చచ్చిపోయింది. నీ చేత్తో రెండు మెతుకులు పడేస్తే తింటాను,” అంది అన్నపూర్ణమ్మ దీనంగా.

సుధాకర్ గుండె తరుక్కుపోయింది. కళ్ళు చెమ్మగిల్లాయి. లేచి నిలబడి, ఆమెవంక జాలిగా చూశాడు. 'ఎలాగైనా ఈమెకి అన్నం తెచ్చిపెట్టాలి' అనుకున్నాడు. రుమాలుతో కళ్ళు అద్దుకున్నాడు.

“కాస్త ఓపిక పట్టండి....లోపలికెళ్ళి అన్నం తెస్తాను,” అంటూ నిష్క్రమించాడు. పదిహేను నిమిషాల్లో తిరిగి వచ్చాడు సుధాకర్. అన్నపూర్ణమ్మ దగ్గర కూర్చుని తువ్వాలు మూటవిప్పి ఆమె ముందు పరిచాడు. ఆకుల పొట్లం విప్పాడు. “ఇవ్వన్నీ కడుపునిండా భోంచెయ్యండి” అన్నాడు ఆప్యాయంగా చూస్తూ.

అన్నపూర్ణమ్మ అదుర్దాగా విస్తరిలోకి చూసింది. పదార్థాలు ఘుమ ఘుమలాడుతున్నాయి. అన్నీ ఆమె కిష్టమైనవే, కోరుకున్నవే కనిపించాయి. ఆనందం పట్టలేకపోయింది. దుఃఖం పొంగి పొరలింది.

“మా నాయనే.. నా తండ్రే.... ఏ పుణ్యాత్ములు కన్నారో నిన్ను... బిడ్డాపాపలతో ఆయురారోగ్య ఐశ్వర్యాలతో చల్లగా బ్రతకాలి నువ్వు...” అంది కళ్ళు తుడుచుకుంటూ.

“మీరు బ్రాహ్మణులా ?...” అన్నాడు సుధాకర్ అనుమానం వచ్చి.

“అవును బాబూ... అదంతా ఇప్పుడు గుర్తుచెయ్యకు... మనసు ముక్కలవుతుంది మళ్ళీ...” అంటూ నీళ్ళసీసా అందుకుంది. అది ఎండిపోయి వుంది.

“నాయనా నీళ్ళు లేవు... ఎలా ?... కాస్త తెచ్చిపెట్టవా బాబూ. . నీకు చాలా శ్రమ కలిగిస్తున్నాను ...” అంది బిడియంగా.

“అయ్యో . . . మరిచిపోయాను... తెస్తానుండండి” అంటూ వడివడిగా వెళ్ళిపోయాడు సుధాకర్.

అన్నపూర్ణమ్మ మళ్ళీ విస్తరిలోకి చూసింది. నాలుగు బూరెలు తీసి సంచీలో పడేసింది ముష్టిపిల్లల కిద్దామనే వుద్దేశంతో. చెయ్యి తుడుచుకొని గబగబ పప్పు అన్నం కలిపింది. ఆకు చింపి రెండు ముక్కలు చేసి, పప్పు అన్నం



ముద్దలుచేసి ఆకుల్లో వేసింది. ఒక ఆకు పట్టుకొని ఒంగివడుస్తూ, అరుగు చివరకి వెళ్ళి కుక్కని పిలిచి కింద పడేసింది. మరొక ఆకును చెట్టువెనక పెట్టింది కాకుల కోసం.

తిరిగివచ్చి నీరసంగా విస్తరిముందు చతికిలబడింది. ఆకలికి తట్టుకోలేక అన్నంలో పనసకాయకూర కలిపింది. అన్నం పొడిగా వుంది, మెతుకులు మేకుల్లా వున్నాయి. కలిపిన అన్నం చేతినిండా తీసుకొని ఆవురావురంటూ నోట్లో పెట్టుకుంది. వెంటనే మరికొంత కుక్కుకొని, మళ్ళీ చేతినిండా అన్నం పట్టుకుంది. మింగిన ముద్ద మింగుడు పడడంలేదు. ఎడంచేత్తో గుండెలమీద గొంతుమీదా రాసుకుంది. తల మీద కొట్టుకుంది. అడ్డంగా పడిన ముద్ద లోనికి జారడంలేదు. బయటకి రావడం లేదు. ఊపిరి సలపడంలేదు. కళ్ళల్లోంచి నీళ్ళొచ్చేస్తున్నాయి. నవనాడులూ లాగేస్తున్నాయి. ఉక్కిరి బిక్కిరవుతూ భవనం గేటుకేసి చూసింది.

వడగాలి విసిరి కొట్టింది. ధూళి విస్తారంగా రేగింది. అరుగుమీద కల్లోలం చెలరేగింది. గిలగిల కొట్టుకుంటోంది అన్నపూర్ణమ్మ. 'నేను చచ్చిపోతానా?

నేను చచ్చి... పోతానా?' అనుకుంది భయంగా. ఎదురుచూసిన క్షణం దగ్గిర పడిందేమో అనే ఆలోచన వచ్చేసరికి భయంతో గుండె బ్రద్ధలయింది. 'అయ్యయ్యో ... శ్వాస రావడంలేదు... చచ్చిపోతున్నాను...చచ్చిపోతున్నాను... నారాయణ....నా రా య ణ.'

నీళ్ళ చెంబుతో తిరిగి వచ్చాడు సుధాకర్. అతని వెంట నలుగురు పిల్లలు కూడా వచ్చారు అరుగు దగ్గరకు.

అరుగుమీద దృశ్యం చూసి నిర్ఘాంత పోయాడు సుధాకర్. నీళ్ళచెంబు జారి పడింది. నీళ్ళు నేలలో ఇంకిపోయాయి. విస్తరి దగ్గర వెల్లకిలా పడివుంది అన్నపూర్ణమ్మ! ఆమె చేతిలో అన్నం అలాగే వుంది! ఆమె కళ్ళు విస్తరికేసి చూస్తున్నట్టుగా వున్నాయి! ఆమెలో చలనం లేదు! విస్తరిలో అన్నాన్ని కుక్క తినేస్తోంది. దూర దూరంగా కాకులు వాలి, అన్నపూర్ణమ్మ చేతిలోని అన్నాన్ని అందుకోవడానికి చిందులేస్తున్నాయి.

పిల్లలు బెదిరి, భవనంలోకి పారిపోయారు. సుధాకర్ దృష్టి అన్నపూర్ణమ్మ దేహంమీద నిలిచిపోయింది. కళ్ళలో నీటిపొరలు కమ్ముకుంటున్నాయి. కబురు తెలిసి భవనం యజమాని నాగరాజూ, మరికొందరూ హడావుడిగా వచ్చి రోడ్డుమీద నిలబడ్డారు.

రోడ్డు దిగి కాస్త ముందుకువెళ్ళి నడుంమీద చేతులుంచుకొని నిల్చొని అరుగువేపు చూశాడు నాగరాజు.

ఆకులోని అన్నమంతా తినేసి, మనుషుల్ని చూసి గబగబ అరుగు దిగిపోయింది కుక్క, అన్నపూర్ణమ్మ చేతిలోవి అన్నాన్ని అందుకో గలిగాయి కాకులు. బెదురు బెదురుగా వెళ్ళి, అందినంత అన్నాన్ని ముక్కులతో తీసుకొని, దూరంగా పోయి తింటున్నాయి. అక్కడ పడివున్నది అన్నపూర్ణమ్మని గుర్తించాడు నాగరాజు. క్షణకాలం మనసు గిలగిల లాడింది. 'అమ్మ... అమ్మ' అనుకున్నాడు. అంతలోనే మనసు శిలగా మారింది...'కాదుకాదు... అన్నపూర్ణమ్మ' అనుకున్నాడు. ముఖం జేవురించింది. కళ్ళు ఎర్రబారాయి. 'చచ్చిన తర్వాత కూడా నీ చేతిలోని అన్నాన్ని మూగజీవాలకి తినిపిస్తున్నావే!' అనుకున్నాడు కసిగా.

"దానికి అన్నం ఎవరు పెట్టారు?" అన్నాడు నొసలు చిట్లించి సుధాకర్ వంక అనుమానంగా చూస్తూ నాగరాజు.

"నేనే." అనేసి మళ్ళీ అన్నపూర్ణమ్మ దేహంకేసి దిగులుగా చూస్తూండిపోయాడు సుధాకర్. అతని కుడి చెవి వెనక చింత పిక్కంత పుట్టుమచ్చ అదే రంగులో వుంది. అప్రయత్నంగా నాగరాజు దృష్టి దానిమీద పడింది.

'వాడే వీడు! దివాకర్ గాడు!!....ఆ ముఖంలో అన్నపూర్ణమ్మ పోలికలు! ఆ విగ్రహం చక్రవర్తిది! నిశ్చయంగా వీడు దివాకర్ గాడే! తనింతవరకూ హడావిడిలో గమనించలేదు ఆ రోజు ఈ వెధవని తప్పించేయబట్టి క్రమేణా తన బాట సుగమమైంది. ఈనాడు తను ఉచ్ఛస్థితిలో వుండ గలిగాడు. లేకపోతే డబ్బంతా దాన ధర్మాల కోసం తగలబడి పోయేది! తను కూడా దౌర్భాగ్య జీవితం గడిపి, దీనిలాగే దిక్కుమాలిన చావు చావవలసి వచ్చేది! వీడికీ అలాంటి పోయేకాలం బుద్ధులే అలవడి నట్టున్నాయి. అందుకే దానికి అన్నం వేశాడు వెధవ...' పళ్ళు కొరు క్కున్నాడు నాగరాజు.

మరుక్షణంలో -

"ఒరే వెంకన్నా వెళ్ళి ప్రేమ సమాజంవాళ్ళకి చెప్పు — దీన్నిక్కడ్నుంచి తొందరగా తీయించు. శుభమా అంటూ పిల్లకి పెళ్ళి చేసుకుంటూంటే గుమ్మాని కెదురుగా వచ్చి మరీ చచ్చింది దౌర్భాగ్యురాలు. వెళ్ళు త్వరగా" బిగ్గరగా అరిచి వడివడిగా వెళ్ళిపోయాడు నాగరాజు. తలో మాటా అంటూ మిగిలిన వాళ్ళు అతన్ని అనుసరించారు.

అక్కడ సుధాకర్, నౌఖరు వెంకన్నా మిగిలారు.

"ఏమయిందో పాపం. పెట్టిన అన్నం తినకుండానే పోయింది... ప్చ్...!" అంటూ అడుగు ముందుకేశాడు వెంకన్న.

"ఆగు వెంకన్నా... ఈమె దేహాన్ని సమాజం వాళ్ళకి అప్పగించొద్దు... అంత్యక్రియలు నేను జరిపిస్తాను. తల కొరివి నేను పెడతాను. నా కెందుకో అవన్నీ చెయ్యాలనిపిస్తోంది! ఎంత ఖర్చయినా ఫరవాలేదు. ఏర్పాట్లు ఘనంగా చేయించు." గంభీరంగా అని, కళ్ళు తుడుచుకొని, జేబులోంచి డబ్బు తీసి ఇచ్చాడు సుధాకర్.

ఆశ్చర్యంగా చూస్తూ డబ్బందు కున్నాడు వెంకన్న.

"అలాగే బాబూ అలాగే... తప్పకుండా చేస్తాను. నేను కూడా తమకి సాయం చేస్తాను...ఈ తల్లిని చూస్తుంటే నా గుండె తరుక్కుపోతోంది." అంటూ అన్నపూర్ణమ్మ కేసి చూశాడు వెంకన్న చెమ్మగిల్లిన కళ్ళతో.

అన్నపూర్ణమ్మ చేతి వేళ్ళ సందుల్లో ఇరుక్కుపోయిన మెతుకుల్ని కాకి ఏరుకుంటోంది! ఆ చెయ్యి కొద్దికొద్దిగా చలిస్తూ దానికి అన్నం తినిపిస్తున్నట్టుగా కనిపిస్తోంది!

అది ధర్మం చేసిన చెయ్యి!

———